




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం

19 ఏప్రిల్ 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-





## తెలంగాణలో 9 మంది ఐపీఎస్‌లకు స్థానచలనం

- అదనపు ఎస్పీ స్థాయిలో జరిగిన కీలక మార్పులు
- శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- వివిధ జిల్లాలకు కొత్త అధికారులను నియమిస్తూ ఆదేశాలు




## తెలంగాణలో మండుతున్న ఎండలు.. కొమురంభీమ్ జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత

- ఉదయం నుంచే బయటకు రాలేని పరిస్థితులు
- నిజామాబాద్ జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచన

# మహిళా బిల్లును అడ్డుకున్న పాపం వారిదే : ప్రధాని మోదీ

- విపక్షాలను మహిళలు క్షమించరు అంటూ మండిపాటు
- నారీ శక్తి ఆకాంక్షలను నలిపేశారన్న ఆవేదన
- దేశ మహిళలకే క్షమాపణలు తెలిపిన ప్రధాని
- రిజర్వేషన్ల కోసం పోరాటం కొనసాగుతుందన్న హామీ
- విపక్షాలకు గుణపాఠం తప్పదన్న హెచ్చరిక



**చట్టసభల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే మహిళా రిజర్వేషన్ల బిల్లును విపక్షాలు లోక్‌సభలో అడ్డుకోవడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాలు, తమ ఆధిపత్యం పోతుందనే భయంతోనే ప్రతిపక్షాలు నారీశక్తి ఆకాంక్షలను కర్కశంగా నలిపేశాయని ఆయన మండిపడ్డారు. ఈ చారిత్రక బిల్లు ఆమోదం పొందకపోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, దేశ మహిళలందరికీ మోదీ మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేశారు. మహిళల ఎదుగుదలను అడ్డుకున్న విపక్షాల పాపానికి, తగిన సమయంలో నారీలోకం వారికి కచ్చితంగా గుణపాఠం చెబుతుందని ఆయన హెచ్చరించారు.**

న్యూఢిల్లీ: మహిళలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును లోక్‌సభలో విపక్షాలు అడ్డుకోవడం దేశ మహిళల ఆశయాలను దెబ్బతీసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా మండిపడ్డారు. బిల్లు ఆమోదం పొందకపోవడం పట్ల తాను తీవ్రంగా విచారం వ్యక్తం చేస్తున్నానని, దేశంలోని మహిళలందరికీ మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలుపుతున్నానని వెల్లడించారు. జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విపక్షాలు స్వార్థ రాజకీయాల కోసం మహిళల హక్కులను అణచివేశాయని, వారి అసలు స్వరూపం బయటపడిందని ప్రధాని విమర్శించారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకోవడం జరిగిందని, దేశ ప్రజలు దీనిని గమనిస్తున్నారని అన్నారు. మహిళల ఆకాంక్షలను కర్కశంగా నలిపేసిన ఈ చర్యను వారు ఎప్పటికీ మర్చిపోరని, తగిన సమయంలో గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. మహిళా సాధికారతకు ఈ బిల్లు కీలకమని పేర్కొంటూ, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుందని ప్రధాని తెలిపారు. అయితే లోక్‌సభలో అవసరమైన మద్దతు లేకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేకపోయిందని చెప్పారు. అయినప్పటికీ మహిళా రిజర్వేషన్ల అమలుపై తమ కట్టుబాటు తగ్గదని

(మిగతా 2వ పేజీలో)



## తక్షణమే అమలు చేయండి!

**మహిళా రిజర్వేషన్‌పై సీఎం రేవంత్ సూచన**


- ప్రస్తుత సీట్లలోనే మూడో వంతు కేటాయిస్తే మద్దతు
- ఒకే రోజులో ఆమోదం.. వెంటనే అమలు సాధ్యమని వ్యాఖ్య
- పునర్విభజనతో కలిపే ప్రయత్నం తప్పుబాటు
- అఖిలపక్ష చర్చలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- కేంద్ర ఉద్దేశాలపై తీవ్ర అనుమానాలు వ్యక్తం

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్‌ను ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే ఆమోదం పొందిన చట్టాన్ని లేదా స్వల్ప సవరణలతో మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెడితే తాము పూర్తి మద్దతు ఇస్తామని వెల్లడించారు. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల్లోనే మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించే విధానం అమలు చేస్తే ఎలాంటి అవరోధాలు ఉండవని స్పష్టం చేశారు. ఒకే రోజులో బిల్లును ఆమోదించి వెంటనే అమలులోకి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అంశాన్ని నియోజకవర్గాల పునర్విభజనతో అనుసంధానం చేయడం సరైంది కాదని సీఎం హెచ్చరించారు. అలా చేస్తే రాజ్యాంగ పరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ప్రజలు అంగీకరించరని తెలిపారు. పార్లమెంట్‌లో

(మిగతా 2వ పేజీలో)

# భారత నౌకలపై ఇరాన్ కాల్పులు: కేంద్రం

- రాయబారికి సమన్లు.. తీవ్ర నిరసన వ్యక్తం
- జలసంధి మూసివేతతో చిక్కుకున్న నౌకలు
- ఒప్పందం లేకపోతే బాంబుల ముప్పు: ట్రంప్ హెచ్చరిక
- కాల్పుల విరమణకు గండం.. మళ్లీ యుద్ధ మేఘాలు
- పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చమురు రవాణాకు కీలక మార్గమైన హార్ముజ్ జలసంధి వద్ద పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారాయి. శనివారం ఆ మార్గంలో ప్రయాణిస్తున్న భారత చమురు నౌకలపై ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్ దళాలు కాల్పులకు దిగిన ఘటన ఆందోళన కలిగించింది. ఈ ఘటనతో నౌకలు ముందుకు సాగలేక వెనుదిరిగినట్టు అంతర్జాతీయ వర్గాలు వెల్లడించాయి. నౌకల్లోని సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని సమాచారం. ఈ పరిణామంపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో ఉన్న ఇరాన్ రాయబారిని పిలిపించి వివరణ కోరింది. ఈ చర్యను ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిరసన తెలిపినట్టు సమాచారం. అదే సమయంలో మరికొన్ని భారత నౌకలు కూడా జలసంధి దాటకుండా వెనక్కు మళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పలు నౌకలు అక్కడే నిలిచిపోయినట్టు తెలుస్తోంది. ఇక హార్ముజ్ జలసంధిని తిరిగి మూసివేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించడం పరిస్థితిని

(మిగతా 2వ పేజీలో)



## త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

**: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

- భూముల ధరల పెంపుపై ప్రభుత్వం కసరత్తు
- ఈనెల 20 నుంచి భూ పటం ఆధారంగా రిజిస్ట్రేషన్లు
- పాలేరు నుంచి తొలి నమోదు ప్రారంభం
- వరంగల్ విమానాశ్రయానికి వేగం పెంచాలని ఆదేశం

హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు వేసవి అనంతరం జరిగే అవకాశం ఉన్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మీడియాతో జరిగిన అనౌపచారిక సమావేశంలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. రాష్ట్రంలో భూముల ధరల సవరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. గతంలో కొంతవరకు పరిశీలన జరిగినప్పటికీ, ఇప్పుడు సమగ్రంగా ధరల పెంపుపై కసరత్తు జరుగుతోందని చెప్పారు. దీనిపై త్వరలోనే ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత కోసం

(మిగతా 2వ పేజీలో)

## సింహం బయటకు వస్తుంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతోంది: కేటీఆర్



- కేసీఆర్ సభకు వస్తున్నారని తెలిసి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని విమర్శ
- కేసీఆర్ జగిత్యాల వస్తున్నారనగానే రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళు తున్నారని ఆగ్రహం
- కేసీఆర్ సభ అనేసరికి రోడ్లను తవ్వుతున్నారని విమర్శ

## దక్షిణాదికి విపక్షాల చారిత్రక ద్రోహం.. రక్షణ కవచం లాంటి బిల్లును చంపేశారు: బండి సంజయ్

- దక్షిణాది ప్రయోజనాలను కాపాడే బిల్లును విపక్షాలు అడ్డుకున్నాయన్న బండి సంజయ్
- దక్షిణాది గౌరవం పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- రాజకీయ స్వార్థం కోసం చారిత్రక సంస్కరణను అడ్డుకున్నారని మండిపాటు



# డిజిటల్ ఫ్లెక్సీలతో సాంప్రదాయ కళ కనుమరు....

# నేడు హిందూ సమ్మేళనంతో మళ్లీ మన ముందుకు.




**- ఫ్లెక్సీ ప్లాస్టిక్ పదార్థం ఇది పర్యావరణానికి హానికరం నిపుణులు హెచ్చరిస్తున్న వినే వాడే లేడు.!**

**- బ్యానర్ పెయింటింగ్స్ ను వాడుదాం.. హస్తకళ కార్మికులను కాపాడుదాం.!**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

డిజిటల్ ఫ్లెక్సీ బ్యానర్ ల రాకతో ఒకప్పుడు సందడిగా కనిపించే సాంప్రదాయ బ్యానర్, పోస్టర్, డిజైన్ల కళ కనుమరుకు అయ్యింది, ఫ్లెక్సీ ప్రింటింగ్ టెక్నాలజీ వల్ల వేగంగా ఆకర్షణీయంగా, తక్కువ ఖర్చుతో ఎక్కువ బ్యానర్లు వేయడం సాధ్యమవుతుంది. దీని ప్రభావంతో సాంప్రదాయ హస్తకళ ఒకప్పుడు చేతితో చిత్రించిన బ్యానర్లు, పెయింటింగ్స్ స్థానంలో ఇప్పుడు డిజిటల్ ప్రింటింగ్ వచ్చింది. సమయం ఆదా అవుతుందని ఫ్లెక్సీ ప్రింటింగ్ తో ఎక్కువ సమయంలోనే వందలాది బ్యానర్లు సిద్ధం చేసుకునే అవకాశం.

పర్యావరణ ప్రభావం పై ప్రజల్లో అవగాహనా ఏది

ఫ్లెక్సీ ప్లాస్టిక్ పదార్థం రావడంతో ఇది పర్యావరణానికి హానికరం దీనివల్ల మైక్రో ప్లాస్టిక్స్ విడుదలై కాలుష్యానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్న అయినప్పటికీ సాంకేతికత కారణంగా బ్యానర్ల డిజైనింగ్ వంటి సాఫ్ట్వేర్ టెక్నాలజీ ద్వారా మరింత వృత్తిపరంగా మారింది

ప్లాస్టిక్ ని నిషేధిద్దాం... హస్తకళ కళాకారులను కాపాడుకుందాం.!

ఎన్నో సంవత్సరాలుగా చేతి వృత్తిని నమ్ముకుని తన హస్తకళలతో బ్యానర్, పెయింటింగ్, వాల్ రైటింగ్ ను నమ్ముకుని బతుకుతున్న ఆర్టిస్టులకు అండగా నిలుస్తూ.! ఫ్లెక్సీ ప్లాస్టిక్ తో పర్యావరణానికి హానికరం అనే గుర్తు చేసుకుంటూ ప్లాస్టిక్ ను నిషేధిద్దాం.! హస్తకళ కార్మికులను కాపాడుకుందాం.!

# హయత్ నగర్ 1-2 డిపో గేట్ వద్ద సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

**- ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే 22 న సమ్మె విజయవంతం చేద్దాం**

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే 22/4/2026 నుండి జరిగే సమ్మె కి మద్దతుగా హయత్నగర్ 1 డిపో దగ్గర గెట్ మీటింగ్ కి తెలంగాణ ఆర్టీసీ కార్మిక సమైక్య రాష్ట్ర నాయకులు శ్రీ రాజిరెడ్డి గారు పాల్గొన్నారు ఆర్టీసీ ని ప్రభుత్వం లో విలీనం, 2 పి ఆర్ సి లు, యూనియన్ ల పునరుద్ధరణ, పనిబారం, సమస్య లను పరిష్కరించాలని లేని పక్షం లో 22/4/2026 నుండి సమ్మె లోకి వెళ్తామని తెలిపారు ఈ కార్యక్రమం లో డిపో నాయకులు వెంకటేష్, ఎం స్ రెడ్డి, ఏ సి లింగయ్య, పి వి రెడ్డి, వెంకటయ్య,పి స్ రావు, కే వి రావు, బాల నర్సింహా, కోహెడ నర్సింహా, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు



# తెలంగాణను దక్షిణ ఆసియా టెక్స్టైల్ రాజధానిగా తీర్చుదిద్దుతాం..

(మొదటి పేజీ తరువాయి)

జోడించి డిజైన్, కుట్టు పని తదితరాల్లో శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ప్రపంచానికి ఔషధాలు, వ్యాక్సి న్లు అందిస్తున్న తెలంగాణలో తయారయ్యే దుస్తులను ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ధరించేలా వస్త్ర పరిశ్రమను తీర్చిదిద్దడం లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో శుక్రవారం 'ఏషియన్ టెక్స్టైల్స్ కాన్ఫరెన్స్ 2026'(ఎటెక్స్కాన్)ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 'శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సాంప్రదాయాల కలబోతగా తెలంగాణ వస్త్ర పరిశ్రమ నిలుస్తోంది. మన జీవన విధానంలో వస్త్ర పరిశ్రమ అంతర్భాగంగా ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచం నలుమూలల నుంచి హైదరాబాద్‌కు వచ్చే వ్యాపారులు ముత్యాలు, వస్త్రాలు కొనుగోలు చేసేవారు. పోచంపల్లి ఇక్కత్ మొదలుగద్వాల చీరలు, వరంగల్ దర్రీలు, నారాయణపేట చేనేత వరకు అనేక రకాలైన వ్రస్తోత్పత్తుల్లో తెలంగాణకు ఎంతో పేరు ఉంది'అని సీఎం పేర్కొన్నారు.



**పత్తి ఉత్పత్తి నాణ్యతలో అగ్రగామి**

'భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా పత్తి ఉత్పత్తి, నాణ్యతలోనూ తెలంగాణ అగ్రగామిగా ఉంది. వరంగల్ కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో ప్రపంచస్థాయిలో పేరొందిన సంస్థలు దుస్తుల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేశాయి. నైపుణ్యం, సంకల్పం, అత్యుత్తమ మానవ వనరులు, ప్రపంచానికి సరితూగే విధానాలతోపాటు వస్త్ర పరిశ్రమపై తెలంగాణకు దూరదృష్టి కూడా ఉంది. తెలంగాణ పత్తి చేల నుంచి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోల వరకు అనేక అంశాల్లో మేం కలిసి పనిచేస్తున్నాం. హైదరాబాద్ భారతదేశానికి మాత్రమే కాదు..ప్రపంచానికి కూడా సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతూ హాలీవుడ్ స్థాయికి చేరింది. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్‌ను తమ నిర్మాణ కేంద్రంగా ఉపయోగిస్తున్నాయి. సినిమా రంగం ద్వారా కూడా ఫ్యాషన్ రంగాన్ని ప్రోత్సహిస్తాం. పెట్టుబడులతో వచ్చే వారికి మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, ఇతర ప్రోత్సాహకాలతోపాటు వేగంగా అనుమతులు మంజూరు చేస్తాం. ప్రపంచాన్ని మార్చగలిగే స్థాయిలో తెలంగాణలో వ్రస్తోత్పత్తి పరిశ్రమ వాతావరణాన్ని నిర్మిద్దాం'అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

**నేతన్నకు అందించే సామాజిక న్యాయం : శ్రీధర్‌బాబు**

ప్రభుత్వం దృష్టిలో వస్త్రోత్పత్తి అంటే అట్టడుగున ఉన్న నేతన్నకు అందించే సామాజిక న్యాయమని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 'స్వాతంత్ర్యం చరఖా, మగ్గం ద్వారా కూడా వస్తుందని మహాత్మాగాంధీ నిరూపించారు. అంతర్జాతీయ సరఫరా గొలుసులో నేతన్నలు కూలీగానే మిగిలిపోకుండా యజమానిగా ఎదగాలనే సంకల్పంతో నేత కార్మికులను ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తున్నాం. ఆధునిక సాంకేతికతతో మేడిన్ తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకు 'న్యూ స్వదేశీ విజన్'కు శ్రీకారం చుడుతున్నాం. డిజిటల్ డిజైన్లు, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం ద్వారా తెలంగాణ నేతన్నల నైపుణ్యాన్ని మిలాన్, న్యూయార్క్ వంటి అంతర్జాతీయ ఫ్యాషన్ వేదికలపైకి చేర్చాలని లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్తున్నాం'అని శ్రీధర్‌బాబు ప్రకటించారు.'తెలంగాణలో టెక్స్టైల్ రంగం కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు. వేలాది కుటుంబాల జీవనాధారం. మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబం.

# గిరిజనుల ఏ ఒక్క హామీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు

తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కేవలం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని మాజీ మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా కొత్తపల్లిలో బావోజీ మహారాజ్‌ను దర్శించుకున్న ఆయన, అనంతరం గిరిజన సోదరులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. గిరిజనులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. దశాబ్దాల కాలంగా గిరిజనులు కలలుగన్న "మా తండాలో మా రాజ్యం" నినాదాన్ని నిజం చేసింది కేసీఆర్ మాత్రమేనని హరీష్ రావు గుర్తు చేశారు. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోని 3,100 గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని ఆయన పేర్కొన్నారు. అలాగే, విద్య , ఉద్యోగాల్లో గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతానికి పెంచడం వల్ల నేడు వేలాది మంది గిరిజన బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లుగా ఉన్నత పదవుల్లో స్థిరపడుతున్నారని ఆయన వివరించారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించి, నిధులు కేటాయించి ఊరూరా ఘనంగా నిర్వహించేలా చేసింది తమ ప్రభుత్వమేనని హరీష్ రావు గర్వంగా చెప్పారు. కొత్తపల్లి ప్రాంతంలో రూ. 8 కోట్లతో బ్రిడ్జిని నిర్మించడంతో పాటు, రూ. 50 లక్షలతో బంజారా భవనాన్ని, బావోజీ మహారాజ్ దేవాలయ అభివృద్ధికి రూ. 80 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు ఆయన గుర్తు చేశారు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి కేసీఆర్ 6 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా, వారికి రైతుబంధు, రైతుబీమా వంటి సౌకర్యాలను కల్పించారని హరీష్ రావు తెలిపారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో లంబాడాలకు కనీసం మంత్రి పదవి కూడా లేదని, గిరిజనులను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిని కాంగ్రెస్ గాలికొదిలేసిందని, ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు అయ్యాయని ఆయన మండిపడ్డారు.

# 365 రోజులున్నా ఫలితం శూన్యం

గజోల్: అసెంబ్లీ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్‌లో 15 రోజులుపాటు ఉంటానంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనపై సీఎం మమతా బెనర్జీ తనదైన శైలిలో స్పందించారు. 'అమిత్ షా అన్నా, బీజేపీ అన్నా బెంగాల్ ప్రజలకు గిట్టదు. అందుకే అమిత్ షా ఇక్కడ 15 రోజులు కాదు..ఏకంగా 365 రోజులపాటు మకాం వేసినా ఎలాంటి ఫలితమూ ఉండదు'అంటూ వ్యాఖ్యానించారు. శుక్రవారం మాల్దా జిల్లా గజోల్‌లో ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. మాల్దాలో సర్ దరఖాస్తుల పరిశీలనకు వెళ్లిన న్యాయాధికారులను 8 గంటలపాటు నిర్బంధంలో ఉంచిన ఘటనపై మమత స్పందిస్తూ.. బీజేపీ హైదరాబాద్ కోకిల ఈ కుట్రకు పథకం వేసిందంటూ పరోక్షంగా ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. ఇటీవల టీఎంసీ నుంచి వేరుపడి ఆమ్ జనతా ఉన్నయన్ పేరుతో పార్టీ పెట్టిన హుమాయూన్ కబీర్‌కు మద్దతు ప్రకటించిన ఎంఐఎం చీఫ్ ముస్లింల ఓట్లు చీల్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన ఎంఐఎం, ఐఎస్ఎఫ్ కార్యకర్తలకు మాల్దా ఘటనలో ప్రమేయం ఉందన్నారు. ఇందులో కాంగ్రెస్ హస్తం కూడా ఉందని చెప్పారు. 'మాల్దా ఘటన బెంగాల్ పరువును మంటగలిపింది. ఈ ఘటనకు కారణం స్థానికులు కారు. వాళ్లకు ఇబ్బందులు ఉండే ఉండొచ్చు. బయటి వ్యక్తులే వారిని ఈ ఉచ్చులోకి లాగారు. హైదరాబాద్ నుంచి తమ మతానికి చెందిన కొందరిని వెంటేసుకు వచ్చిన ఒక బీజేపీ కోయిల దీని వెనుక ఉంది. పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న వారిని ఎయిర్‌పోర్టులో మా సీఐడీ బృందం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది'అని మమత తెలిపారు.

# మీరు ఏకవచనంతో మాట్లాడొచ్చా

తెలుగుదేశం ప్రభుత్వం దోపిడీ, అక్రమాలపై పోరాడే వారికి అండగా ఉండటమే తన ఉద్యోగం అని మాజీ మంత్రి పేర్ని నాని చెప్పారు. పోరాటం చేసే వారిపై అక్రమ కేసులు పెట్టిన వారిని నిలదీయడమే తన పని అని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటా అని.. అన్యాయానికి గురైనోడే ప్రశ్నిస్తాడన్నారు. రాజకీయాల్లో చెడిపోయిన వారి లాగే పోలీసుల్లోనూ కొందరు చెడిపోయారని విమర్శించారు. యూనిఫాం వేసుకుని కూడా కొందరు బార్లలో మందు తాగుతున్నారని మండిపడ్డారు. కృష్ణా జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు జైపాల్‌పై పేర్ని నాని ఫైర్ అయ్యారు. 'మీరు ఏకవచనంతో మాట్లాడొచ్చా. తండ్రి వయసుంటే ఏం పీక్కుంటారో పీక్కోండి సీఐ అనొచ్చా. గత వైసీపీ ప్రభుత్వంలో మచిలీపట్నంలో సీఐ పరమేశ్వర్ ఎప్పుడు పనిచేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ పేదవాడి ఇంటిని మేం కొట్టించాం. మేం ఏ పేదవాడి ఇంటిని కూలగొడుతుంటే.. ఈ సీఐ వచ్చి బందోబస్తు ఇచ్చారు. వయసులో పెద్ద వారైనంత మాత్రాన ఏకవచనంతో సంభోదిస్తారా?. నువ్వు నువ్వు మీరు అనొచ్చు.. మేం అనకూడదా?. నేను పోలీసుల గురించే మాట్లాడానని మీకు మీరు అన్వయించుకోవడమేనా?. గుమ్మడికాయ దొంగలు ఎవరంటే మీరు భుజాలు తడుముకోవడం దేనికి. నేను సీఐ పేరు ఎక్కడైనా ప్రస్తావించానా?. పంపుల దగ్గర తగాదాలతో మీకేం సంబంధం. మీరు పెట్టే అక్రమ కేసులు నిలబడతాయా?. కంకిపాడులో పేకాట ఆడిస్తున్నందుకు పరమేశ్వర్ సస్పెండ్ అయ్యాడు. మీకు చేతనైతే ఆ విషయంపై స్పందించండి' అని పేర్ని నాని ఫైర్ అయ్యారు.

# రాజ్యసభలో గొంతు నొక్కేశారు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు2026పై రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా వైఎస్సార్‌సీపీ గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందని, ఉద్దేశపూర్వకంగానే తమకు తక్కువ సమయం కేటాయించారని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి చెప్పారు.ఆచరణ సాధ్యం కాని రీతిలో ప్రజలకు భ్రమలు కల్పిస్తూ సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నందున అక్కడ జరుగుతున్న అవినీతిని, లోపభూయిష్టమైన బిల్లును మాత్రమే వ్యతిరేకిస్తున్నామని మరోసారి స్పష్టం చేశారు. రాజ్యసభలో జరిగిన పక్షపాత వైఖరిపై ఆయన పార్టీ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి, ఎంపీలు డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, గొల్ల బాబూరావుతో కలిసి ఢిల్లీలో ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ రాధాకృష్ణన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాజ్యసభ చైర్మన్‌కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను వివరించారు. సభలో జరిగిన వివక్ష, అమరావతి నిర్మాణంలో జరుగుతున్న ప్రజాధనం లూటీని తీవ్రస్థాయిలో ఎండగట్టారు.




## మల్లాపూర్‌లో విజ్ఞాన భారతి హైస్కూల్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ఉప్పల్, ఏప్రిల్ 18 (సాక్ష్యం):

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ఈ ఏడాది నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, స్కూల్ డైరెక్టర్ బుచ్చిరెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పన్నాల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని క్రీడలతో పాటు కళలు, వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాలతో మాత్రమే పరిమితం కాకుండా సమగ్ర అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. స్కూల్ డైరెక్టర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, ఈ సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ ట్రైనర్లు, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, ఫైళ్ల ప్రవీణ్ కుమార్, ఉస్మాన్, రాపోలు శ్రీనివాస్, మెండ రఘు, లింగాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గృహనిర్బంధం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 18:

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును పోలీసులు గృహనిర్బంధం చేశారు. మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీఎం నివాసాన్ని ముట్టడించేందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఓయూ పోలీసులు ముందస్తు చర్యగా ఆయనను తార్నాక లోని ఆయన ఇంటి వద్దే నిలిపివేశారు. మహిళా బిల్లుపై కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ బీజేపీ పోరాటానికి సిద్ధమైంది. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సీఎం నివాసానికి చేరుకునే అవకాశం ఉన్నందున పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. గృహనిర్బంధంలో ఉన్న ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ, నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల హక్కులను కాపాడేందుకు బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారకుండా ఉండేందుకు నగరంలో పలు ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెంచారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్, పోచయ్య యాదవ్, సుక్క గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృశ్రీనగర్‌లో హిందూ సమ్మేళనం....
## ప్రముఖుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు...

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : 'మనమంతా హిందువులం, అదే మన అనుబంధం' అనే నినాదంతో ఈ రోజు ఆదివారం సాయంత్రం 5:30 నుంచి 8:30 గంటల వరకు మాతృశ్రీనగర్ కమ్యూనిటీ హాల్ మైదానంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం జరగనుంది. హిందూ ధర్మం, హిందూ సంస్కృతి, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి భారత దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టే సంకల్పంతో మాతృశ్రీనగర్ హిందూ సమ్మేళన ఉత్సవ కమిటీ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సదేహా ఫౌండేషన్ స్థాపకురాలు శిల్పా దీది, విశిష్ట అతిథిగా హిందూ జనశక్తి నుంచి లలిత్ కుమార్ హాజరుకానున్నారు. ప్రముఖుల ప్రసంగాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమానంతరం ప్రసాదం స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. 'గడప లోపలే కులం, గడప దాటితే హిందువులం, మనమంతా బంధువులం' అనే సందేశంతో అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ విజ్ఞప్తి చేసింది.



## హిందూ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ.....

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మే నెల 2వ తేదీన జరగబోయే హిందూ సమ్మేళనం కి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ ను శనివారం హఫీజ్ పేట లో జరిగిన హిందూ ధర్మ సమ్మేళనం సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ పేట హిందూ సమ్మేళనం ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు అలాగే హిందూ సభకు సంబంధించిన మొదటి చందా రూ .25,000/- బి ఎల్ వై చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బోయిని మహేష్ యాదవ్ హిందూ సమ్మేళనం సభ్యులకు ఇచ్చి మొదటి రశీదు పొందడం జరిగింది..వచ్చే మే 2తేదీన హిందూ సమ్మేళనం కార్యక్రమానికి అధిక సంఖ్యలో హిందువులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ డాక్టర్ భూషణ్ జి, కమిటీ అధ్యక్షులు ఆచారి , అధ్యక్షులు నరహరి పటేల్ , ముఖ్య సలహాదారులు బాలింగ్ యాదగిరి గౌడ్ , కృష్ణ యాదవ్ , వెంకటేష్ గౌడ్, నరేందర్ గౌడ్, కుమ్మరి శ్రీశైలం, విక్రాంత్ రెడ్డి, సంజీవరెడ్డి, సుధాకర్, సంజు, సురేష్, సంతోష్ గౌడ్, సాయి, మన్నె వెంకటేష్, వాసు, మనోజ్ యాదవ్, నవీన్, పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు అందుకున్న ఆడపు లక్ష్మణ్



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :

ఏప్రిల్ 18; బాబా సాహెబ్ అంబేద్కర్ 135 జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా నిర్వహిస్తున్న మహనీయుల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రము లో దళితుల పక్షాన పోరాడుతున్న వారికీ ,దళితులకు సేవలను చేస్తున్న వారిని గుర్తించి అందులో భాగంగా ఆడపు లక్ష్మణ్ కి దళిత రత్న అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల కమిటీ ఛైర్మెన్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్,కో ఛైర్మెన్ సుదర్శన్ బాబు, మరియు అవార్డు కు సహకరించిన ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు

## తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సు -- హామీల అమలుకు ప్రభుత్వంపై డిమాండ్





సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 18:తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం శనివారం హైదరాబాద్‌లోని తార్నాకలో మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సును నిర్వహించి, ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తీర్మానించారు. సదస్సుకు టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన ఉద్యమకారుల త్యాగాలను ప్రభుత్వం మరవకూడదని, వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సదస్సులో ఉద్యమకారులకు ఉద్యోగాలు, గౌరవ వేతనాలు, నివాస స్థలాల కేటాయింపు, ఆరోగ్య సదుపాయాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో ఆలస్యం జరుగుతుందని అభిప్రాయపడి, వాటిని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇదిలా ఉండగా, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానాలు రూపొందించాలని, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. భవిష్యత్తులో హామీలు అమలు కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గృహనిర్బంధం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 18:

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును పోలీసులు గృహనిర్బంధం చేశారు. మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీఎం నివాసాన్ని ముట్టడించేందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఓయూ పోలీసులు ముందస్తు చర్యగా ఆయనను తార్నాక లోని ఆయన ఇంటి వద్దే నిలిపివేశారు. మహిళా బిల్లుపై కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ బీజేపీ పోరాటానికి సిద్ధమైంది. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సీఎం నివాసానికి చేరుకునే అవకాశం ఉన్నందున పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. గృహనిర్బంధంలో ఉన్న ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ, నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల హక్కులను కాపాడేందుకు బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారకుండా ఉండేందుకు నగరంలో పలు ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెంచారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్, పోచయ్య యాదవ్, సుక్క గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో సాయి జీనియస్ హై స్కూల్ కు ఉత్తమ పాఠశాలగా ప్రిన్సిపాల్ చౌకి సుధా రమేష్ గారికి ఘన మైన గౌరవం.






కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, ఏప్రిల్ 18

సాయి జీనియస్ హై స్కూల్ ప్రొఫైల్ పబ్లిషర్స్ ముంబాయి వారి కరికులంను సమర్థవంతంగా అమలు చేయడంలో దేశవ్యాప్తంగా జాతీయ స్థాయిలో ఉత్తమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎంపికైన చౌకి సుధా రమేష్ గారు అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఇట్టి పురస్కారాన్ని హైదరాబాదులోని నోవిటాల్ కన్వెన్షన్ లో బహూకరించారు. వారి విశిష్ట నాయకత్వం, అంకితభావం మరియు విద్యా రంగంపై ఉన్న నిబద్ధత వల్ల ఈ ఘనత సాధ్యమైందని విద్యావర్గాలు ప్రశంసిస్తున్నాయి. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన బోధన విధానాలు, సృజనాత్మక విద్యా కార్యక్రమాల అమలులో వారి పాత్ర ప్రశంసనీయం. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ మాట్లాడుతూ, "ఇది మా పాఠశాలకు గర్వకారణం. ఈ ఘనతను సాధించడానికి సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సుధా రమేష్ నాయకత్వంలో మరిన్ని విజయాలు సాధిస్తామని ఆశిస్తున్నాం" అని తెలిపారు. అలాగే టీచింగ్ మరియు నాన్-టీచింగ్ సిబ్బంది అందరూ కలిసి చౌకి సుధా రమేష్ గారిని శాలువా, జ్ఞాపికతో అభినందించారు.

## మాధాపూర్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం...

### డ్రైవర్లకు సూచనలు...





మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లోని బుట్ట కన్వెన్షన్ సెంటర్ లో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీసీపీలు రితిరాజ్, రంజన్ రతన్ కుమార్, ఏడీసీపీ హనుమంతరావు, ఏసీపీలు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్ కుమార్, ఎస్‌హెచ్‌ఓలు శ్రీధర్, సురేష్, పవన్, ప్రదీప్ తదితరులు, మాధాపూర్ డివిజన్‌కు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 600 మంది బస్సు మరియు ఆటో డ్రైవర్లు హాజరై ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, అధిక వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించడంతో పాటు పాఠశాల బస్సుల భద్రతపై ప్రత్యేక సూచనలు ఇచ్చారు. "జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే -- ఉల్లంఘనదారులకు కౌన్సెలింగ్" భాగంగా జరిమానాలు విధించకుండా కౌన్సెలింగ్ ద్వారా మార్పు తీసుకురావాలని అధికారులు తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిబంధనలు పాటించి "అరైవ్ అలైవ్" లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.

## తీన్మార్ మల్లన్న చిత్రపటానికి పాలాభిషేకం



లి మల్లన్న పోరాటంతోనే కులగణన రిపోర్ట్ కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 18 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన సర్వే కోసం నిరంతరం పోరాటం చేసిన టిఆర్పీ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు కృతజ్ఞతగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు పనగట్ల చక్రపాని గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా యూత్ అధ్యక్షులు సింగం అరుణ్ పటేల్, మహిళా విభాగం అధ్యక్షురాలు నీరుడు షాలిని తో కలిసి

**సైనిక్ పురి చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.**

ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ ఈ తెలంగాణ రాష్ట్రములో తీన్మార్ మల్లన్న పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసిందని, చేసిన కులగణన రిపోర్టులో కులాల వారిగా తీసిన లెక్కలను ఇప్పటి వరకు ప్రజల ముందు బయటపెట్టకపోవడం సిగ్గుచేటని వారన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పలు మార్లు ప్రభుత్వాన్ని కులగణన రిపోర్టు బయట పెట్టాలని వివిధ మాధ్యమాల ద్వారా, శాసన మండలి లో ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రభుత్వ మెడలు వంచి నేడు కులగనన రిపోర్ట్ ని బయట పెట్టి పబ్లిక్ డొమైన్ లో పెట్టేంత వరకు పోరాడి ఉద్యమించిన ఏకైక నాయకుడు తీన్మార్ మల్లన్న గారు అని వారు అన్నారు. రానున్న రోజులలో తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు సుంకరి ప్రవీణ్, అప్పల అభిరామ్, కార్మిక విభాగం ఉపాధ్యక్షులు రచ్చలమల్ల లక్ష్మణ్,అనిల్, యూత్ ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, కార్యదర్శి నర్సింగ్, బాబు,సహాయ కార్యదర్శులు జి. కృష్ణ, అధికార ప్రతినిధి మచ్చ పాండు, యువజన విభాగం అనూప్ ,రాజశేఖర్, శ్రీనాథ్, మురళి, ప్రవీణ్, సాయి కిరణ్ , మహిళా విభాగం నుండి నస్రిన్ సుల్తానా, సౌభాగ్య,వనజ, సోషల్ మీడియా కన్వీనర్ మురళి ,డివిజన్ అధ్యక్షులు కాసుల నందం,నీల రమేష్, బిక్షపతి, రాజు, దిలీప్ పాల్గొన్నారు.



## హనుమాన్ టెంపుల్ లో కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ

### జై శ్రీరామ్ -జై హనుమాన్ నినాదాలతో ప్రసాదం స్వీకరించిన హనుమ భక్తులు

కర్మన్ ఘట్ వార్త మిర్రర్ ప్రతినిధికృష్ణ గోపాల్ సేవా సమితి తరపున కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో ప్రసాద పంపిణీ జరిగింది. ఇందులో సుమారు 2000 మంది భక్తులు 'జై శ్రీ రామ్' నినాదాలతో ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ,భక్తులకు దేవుడిపై అపారమైన విశ్వాసం ఉందని, అందుకే వారు ఇంతటి ఎండలో భగవంతుని దర్శనం కోసం వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి సచిన్ అగర్వాల్, కోశాధికారి కుష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా, ఇతర సభ్యులు సిద్ధార్థ్ పాల్చం, డోమల్లపల్లి సునీల్,పాక సతీష్ యాదవ్, ఆకాష్ ధావలే పాల్గొన్నారు. సునీల్ దరాడే,శేఖర్ రెడ్డి ప్రసాదం స్వీకరించి స్వామివారి దర్శనం చేసుకున్నారు



## పుల్లెంల గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

### అడ్వకేట్ వడ్డగాని రవికుమార్ సొంత నిధులతో ఏర్పాటు

చండూరు వార్త మిర్రర్ ప్రతినిధిచండూర్ మండలం పుల్లెంల గ్రామ ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించాలని తాను పుట్టిన గ్రామానికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన దాత (అడ్వకేట్) వడ్డగాని రవికుమార్ గారు తన సొంత నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవనం దగ్గర వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి నేడు ప్రారంభించారు. సురక్షిత త్రాగునీటిని అందించారని గ్రామస్థులు దాత రవికుమార్ గారిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో దాత కుమారులు హేమ్ చందర్ ,దుర్గ ప్రసాద్ ,సర్పంచ్ ముక్కముల వెంకన్న,ఉప సర్పంచ్ చెడుబుద్ధి ఉషయ్య, మాజీ ఎంపీటీసీలు సీత యాదయ్య,వడ్డగాని రాఘవేందర్ గ్రామ పెద్దలు మందడి శంకర్ రెడ్డి,గోపిడి వెంకట్ రెడ్డి,వడ్డగాని చంద్రశేఖర్ గౌడ్ ,లగ్గోని దశరథ,భూతరాజు బాలరాజు,పాలకూరి రాములు,ఇరిగి బుచ్చయ్య,ముక్కముల నర్సింహ్మ,కొల్లోజు మాధనచారి,నడికూడ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.



## పురస్కార గ్రహీత కు సన్మానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 18

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, తెలుగు భాష చైతన్య సమితి, సర్వే జన ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ వాగ్దేవి పురస్కారం అందుకున్న చెరుకు మహేశ్వర శర్మ ను రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తమ పాఠశాలకు చెందిన తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ రాష్ట్ర స్థాయిలో కందుకూరి వీరేశలింగం పంతులు గారి స్మారక జాతీయ వాగ్దేవి పురస్కారం అందుకోవడం అభినందనీయమని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రాజశేఖర్, అయిత పద్మ, గుండేటి తరంగిణి ఏనుగు రజిత, పుర్రె రమేష్,సంగాత్రి శోభ యం.డి.రాజమహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



## అలరించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు....

మాదాపూర్ వార్త మిర్రర్ : శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం శ్రీ నారాయణి నాట్యాలయ గురువు శ్రీ సంతోష్ కుమార్ తమాంగ్ శిష్య బృందం చే భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. పుష్పాంజలి, అలరిపు, సుబ్రమణ్య కౌతం, జతిస్వరం, శబ్దం, పద వర్ణం, శివ స్తుతి, దేవర్ణమా, కమలలోచన, తిల్లాన , మంగళం అంశాలను కళాకారులు అక్షర, అమేయ, అనఘా, హర్షిత, మౌనిక, నిధి, పార్వతి , శ్లోక, భావన, స్తుతి, యామిని, ఉర్విజ, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. నాట్య గురువులు డాక్టర్ అరుణ భిక్షు , శ్రీమతి భారతి మరియు శ్రీ మల్లిక్ ముఖ్య అతిధులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

### -చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామం.దోటి నారాయణ,

### ఎండ తీవ్రత దృష్ట్యా టెంటు మంచినీటి సదుపాయం..లోడే రఘు,

,సంస్థాన్ నారాయణపురం,వార్త మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 18, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని జనగాం గ్రామంలో పిఎసిఎస్ నారాయణపురం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ,జనగాం సర్పంచ్ లోడే రఘు,వాచ్య తండా సర్పంచ్,వాంకుడోతు శోభ సుధాకర్ నాయక్,గంగముల తండా సర్పంచ్ లచ్చు నాయక్,కడప గండి తండా సర్పంచ్ రాము నాయక్,నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామిలు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వడ్లకు సరియైన ధర అందిస్తామని చెప్పారు.రైతులు ఎండ తీవ్రత దృష్ట్యా టెంటు సదుపాయాన్ని,మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశామని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి తీసుకువచ్చిన వరి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీను నాయక్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు,మాజీ సర్పంచ్ దోనూరు



జైపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మందుగుల బాలకృష్ణ,గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి బిక్షపతి నాయక్,చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిచ్చ నాయక్,వార్డు మెంబర్ సూరపల్లి వెంకటేశం,పిఎసిఎస్ స్పెషల్ ఆఫీసర్ తరుణ్,మండల వ్యవసాయ అధికారి పూజ,వ్యవసాయ విస్తరణ అధికారి నవ్య,ఆర్ఐ జుబేర్,జిపిఓ వెంకన్న,సంఘ కార్యదర్శి శేఖర్,వివిధ గ్రామాలమాజీ సర్పంచులు ,ప్రజా ప్రతినిధులు,రైతులు, మహిళలు, పాల్గొన్నారు.

# బడంగ్పేట్‌లో అక్రమ కూల్చివేతలపై ఆగ్రహించిన సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :

ఏప్రిల్ 18;మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జిహెచ్ఎంసి బడంగ్పేట్ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ కూల్చివేతలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసలు ఏమి చేస్తున్నారో మీకు అర్థం అవుతుందా? ఒకపక్క వ్యాపారాలు సరిగా లేవు, రియల్ ఎస్టేట్ రంగం కుదేలైపోయింది. ఇలాంటి సమయంలో చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టేలా అక్రమ కూల్చివేతలు చేయడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించారు.మేము చేయాలనుకుంటే మా ప్రభుత్వంలోనే ఎప్పుడో చేసేవాళ్లం. కానీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసాం. ఇప్పుడు చిన్న వ్యాపారులను దెబ్బతీయడం సరికాదు అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే డిప్యూటీ కమిషనర్‌కు ఫోన్ చేసి, కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తానని, అప్పటివరకు ఒక్క కూల్చివేత కూడా చేయవద్దని హెచ్చరించారు. అభివృద్ధి పనులకు డబ్బులు లేవని చెబుతున్నారు, కానీ కూల్చివేతలకు డబ్బులు ఎలా ఉన్నాయి? ముందుగా ప్రజల సమస్యలను పరిష్కరించండి. కాలనీలు, గ్రామాల్లో దోమల సమస్య, శానిటేషన్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. 99 రోజుల ప్రణాళికతో ప్రజా అవసర కార్యక్రమాలు చేపట్టాలి అని సూచించారు.ప్రజలను ఇబ్బంది పెట్టే



విధంగా వ్యవహరిస్తే ఊరుకోమని అధికారులను గట్టిగా హెచ్చరించారు. అనంతరం అక్కడికి వచ్చిన జేసీబీ వాహనాలను వెనక్కి పంపించారు.ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి , పెద్దబావి శ్రీనివాసరెడ్డి, కర్రె బల్వంత్, పుట్టగళ్ల సంతోష్ , నందినేని నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ లో హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ...

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 18

హిందూ సమ్మేళన కరపత్రాన్ని నాగారం ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం రోజున హిందూ సమ్మేళన సమితి గౌరవాధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ కట్కం రవి, అధ్యక్షులు ఎనుగందుల రమేష్, ప్రధాన కార్యదర్శి దాసరి గంగాధర్, కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. స్థానిక శిశు మందిర్ లో ఏప్రిల్ 28 మంగళవారం నాడు సాయంత్రం 5 :30 గంటల నుండి ఆధ్యాత్మిక మహోత్సవ కార్యక్రమం జరుపుతున్నట్లు హిందూ సమ్మేళన కార్యక్రమానికి భగవద్గీత ప్రచారకులు శ్రీశ్రీశ్రీ రాధా మనోహర్ దాస్ స్వామివారు, అనుగ్రహం భాషణం చేస్తారని, తెలంగాణ ప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ జిన్నా సత్యనారాయణ రెడ్డి లు సనాతన ధర్మం గూర్చి మార్గదర్శనం చేస్తారని, అలాగే శ్రీగోపూజ, సామూహిక శ్రీహనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుందని తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలందరూ కూడా సకుటుంబ సపరివార సమేతంగా తరలిరావాలని కోరారు. అనంతరం భక్తులకు



అన్నప్రసాద వితరణ వ్యవస్థ కలదని వేలాదిగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ సమ్మేళన సమితి బాధ్యులు తెలిపారు.

# అభివృద్ధి లో మహిళల పాత్రను అడ్డుకున్న కాంగ్రెస్, ఇండీ కూటమి

### మైతాపూర్ బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిరసన

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 18


దేశ రాజకీయ చరిత్రలో అత్యంత కీలకమైన మహిళా రిజర్వేషన్ల అమలు దిశగా అడుగులు వేసేందుకు మహిళలకు చట్టసభల్లో 33 శాతం కోటాను తక్షణమే (2029 నుంచి) అమల్లోకి తెచ్చేందుకు ఉద్దేశించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026 ను ప్రతిపక్షాలు వ్యతిరేకించారు. దీనితో దేశ అభివృద్ధి లో మహిళల పాత్రను కాంగ్రెస్ ,ఆప్ , టీఎంసీ, డీఎంకే, ఇతర ఇండీ కూటమి సభ్యులు అడ్డుకున్నారు...ఇండి కూటమి చేసిన ఈ చారిత్రక తప్పు పై మండలం లోని మైతాపూర్ బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు .. దేశ అభివృద్ధికి చేసే ఏ చట్టాన్ని అయినా ఇండి కూటమి అడ్డుకుంటుందని ఇకనైనా మహిళలు ప్రజలు వారి నిజ స్వరూపం తెలుసుకోవాలని సభ్యులు ప్రజలను కోరారు .. ఈ కార్యక్రమంలో గ్రామ బీజేపీ అధ్యక్షుడు సద్ది మహిపాల్ రెడ్డి మరియు గ్రామ బీజేపీ వార్డు మెంబెర్ లు అయిన భూపెల్లి పరమేష్ బత్తిని శ్రీనివాస్ , శివనీతి అమరేందర్ నాగిరెడ్డి సంతోష్ దొంగ లింగారెడ్డి తొగిటి లక్ష్మీనారాయణ రాజనాల మధు దేశవేణి శ్రీనివాస్ తదితరులు, మహిళామణులు పాల్గొనడం జరిగింది.



# లక్షల్లో ఆదాయం ఇచ్చే సూపర్ బిజినెస్!

# సెట్ అయితే బ్రాండ్ క్రియేట్ చేయొచ్చు!

ఐస్‌క్రీమ్ వ్యాపారం చిన్న స్థాయి నుండి పెద్ద స్థాయి వరకు లాభదాయకమైన అవకాశం. తెలంగాణలో దీన్ని ప్రారంభించడానికి రూ.2 లక్షల నుండి రూ.10 లక్షల వరకు పెట్టుబడి అవసరం. ఖీూూ× వంటి ముఖ్యమైన అనుమతులు తప్పనిసరి. సరైన ప్రణాళిక, నాణ్యతతో 30-50 శాతం లాభాలు పొందవచ్చు.చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు విస్తరించే అవకాశమున్న వ్యాపారాల్లో ఐస్‌క్రీమ్ తయారీ బిజినెస్ ఒకటి. వేసవి కాలంలో మాత్రమే కాకుండా, ప్రస్తుతం సంవత్సరం పొడవునా డిమాండ్ పెరుగుతుండటం ఈ రంగానికి ప్లస్ పాయింట్‌గా మారింది. తక్కువ స్థాయిలో ప్రారంభించాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా నిపుణులు సూచిస్తున్నారు. ఈ వ్యాపారాన్ని ప్రారంభించడానికి పెట్టుబడి పరిమాణం మీ స్థాయిపై ఆధారపడి ఉంటుంది. చిన్న స్థాయిలో హోమ్-బేస్డ్ యూనిట్ కోసం సుమారు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెట్టుబడి సరిపోతుంది. ఇందులో ఐస్‌క్రీమ్ మేకింగ్ మెషిన్, డీప్ ఫ్రీజర్, మిక్సర్, ముడి సరుకులు (పాలు, క్రీమ్, షుగర్, ఫ్లేవర్స్) ఖర్చులు ఉంటాయి. మధ్యస్థ స్థాయి యూనిట్ కోసం రూ.10 లక్షల వరకు పెట్టుబడి అవసరం అవుతుంది. పెద్ద స్థాయిలో బ్రాండ్‌గా ఎదగాలంటే కోల్డ్ స్టోరేజ్, ట్రాన్స్‌పోర్ట్, మార్కెటింగ్ వంటి అంశాలపై ఎక్కువగా ఖర్చు చేయాలి.తెలంగాణలో ఈ వ్యాపారం ప్రారంభించడానికి కొన్ని ముఖ్యమైన అనుమతులు తప్పనిసరి. ముఖ్యంగా ఖీూూ× నుంచి ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలి. అదనంగా స్థానిక మున్సిపాలిటీ లేదా గ్రామపంచాయతీ నుంచి ట్రేడ్ లైసెన్స్, అలాగే +ూ నమోదు అవసరం. పెద్ద స్థాయి యూనిట్‌లకు కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతి కూడా అవసరం కావచ్చు. భనష్టాల విషయానికి వస్తే, ఐస్‌క్రీమ్ వ్యాపారం అధిక మార్జిన్ కలిగిన రంగంగా చెప్పొచ్చు. సరైన క్వాలిటీ, కొత్త ఫ్లేవర్స్, మంచి మార్కెటింగ్ ఉంటే 30 శాతం నుంచి 50 శాతం వరకు లాభం సాధించే అవకాశం ఉంటుంది. అయితే, విద్యుత్ ఖర్చులు, నిల్వ సమస్యలు, సీజనల్ డిమాండ్ మార్పులు వంటి అంశాలు సవాళ్లుగా



మారవచ్చు. ముఖ్యంగా పవర్ కట్‌లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో డీప్ ఫ్రీజింగ్ సమస్యలు వస్తాయి. సరైన ప్రణాళిక, నాణ్యత నియంత్రణ, మార్కెట్ అవగాహన ఉంటే ఐస్‌క్రీమ్ తయారీ వ్యాపారం తెలంగాణలో మంచి లాభాలను అందించే అవకాశమున్న రంగంగా మారుతోంది.